

మూడు నెలల క్రితం నివాసాల కూల్చివేత (ఫైల్)

- బొగ్గులైన్ వాసులపై 'అధికార' హుకుం
- బాధితుల పక్షాన రంగంలోకి టీడీపీ
- ఎలాగైనా ఖాళీ చేయించేందుకు వైసీపీ నేతల ఒత్తిడి
- ఖాళీ చేయాలంటూ మైకుల్లో ప్రచారం
- కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు
- ఎక్కడికెళ్లాలని బొగ్గులైన్ వాసుల ఆందోళన

ఖాళీ చేయండి..!

నంద్యాల టౌన్, జనవరి 2: నంద్యాల మున్సిపల్ పరిధిలోని బొగ్గులైన్ ప్రాంతం వివాదం మళ్లీ రాజుకుంది. మూడు నెలల క్రితం అక్టోబరు మొదటి వారంలో బొగ్గులైన్ వాసులను ఖాళీ చేయించేందుకు అధికారులు చేపట్టిన గృహాల కూల్చివేత వ్యవహారం అప్పట్లో తీవ్ర విమర్శలకు తెరలేపింది. బొగ్గులైన్ వాసులకు ప్రత్యామ్నాయ వసతి చూపించిన తర్వాతే రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహాలను కూల్చివేయాలని టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు నిర్వాసితులకు అండగా వివిధ రూపాల్లో ప్రభుత్వ చర్యలను అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి బొగ్గులైన్ వాసులకు కుందూ ఒడ్డున ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళ పట్టాల్లో గృహాలను నిర్మించుకోవాల్సి ఉంది. అయితే బొగ్గులైన్ వాసులు జనవరి 3 నుంచి ఆ ప్రాంతం ఖాళీ చేయాలని మూడు రోజులుగా మౌఖికంగా ఇంటింటికి వెళ్ళి కొందరు అధికారులు అల్టిమేటం జారీ చేశారు. దీంతో పాటు మైక్‌తో ప్రచారం చేశారు. దీంతో ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

'బొగ్గులైన్'పై 'అధికార' పెత్తనం

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె సెంటర్ - బొమ్మల సత్రం సర్కిల్ రహదారిలో గాంధీనగర్ క్రాస్ రోడ్డు దగ్గర నుంచి ఆర్ఏఆర్ఎస్ ప్రధాన గేటు సమీపం వరకు ఉన్న ప్రాంతాన్ని బొగ్గులైన్‌గా పిలుస్తారు. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలో ఉన్న ఈ ప్రాంతం తీవ్ర రద్దీగా ఉండటంతో రోడ్డు వెడల్పుకోసం ఇరుపక్కల ఉన్న దాదాపు 800 కుటుంబాలను ఖాళీ చేయించాల్సి ఉంది. దాదాపు ఏడు దశాబ్దాలుగా బొగ్గులైన్ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేద కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.



ధ్వంసమైన బొగ్గులైన్ వాసుల గృహాలు

ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని నంద్యాల పట్టణ శివారుల్లో వెంకటేశ్వరపురం నుంచి అయ్యలూరు మెట్ట వరకు బైపాస్‌లో జాతీయ రహదారి రోడ్డును ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా వివిధ ప్రభుత్వాల హయంలో బొగ్గులైన్ వాసులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే ప్రస్తుతం బొగ్గులైన్ ప్రాంతం సమీపంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత రూ.వందల కోట్ల వ్యయంతో కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి, పక్కనే మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. ప్రధాన రోడ్డులో కార్పొరేట్ ఆసుపత్రులకు సమీపంలోనే బొగ్గులైన్ వాసుల నివాస గృహాలు ఉన్నాయి. ఆ నాయకుడికి బొగ్గులైన్ చుట్టుపక్కల రూ. కోట్లు వ్యయం చేసే ఖాళీ స్థలాలు కూడా ఉన్నాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే భవిష్యత్తులో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ఖాళీ స్థలాల కొనుగోలు వేగవంతం చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న బొగ్గులైన్ నివాసితులను ఖాళీ చేయిస్తే తమ ఆస్తులకు రాకపోకలతో పాటు విలువ పెరుగుతుందన్న ఉద్దేశంతో బొగ్గులైన్ ఖాళీ చేయించేందుకు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెస్తుండటం దుమారం రేపుతోంది.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎండీ ఫరూక్ తదితరులు

పునరావాసం కల్పించాకే ఖాళీ చేయించండి : టీడీపీ

బొగ్గులైన్ ప్రాంత వాసులకు పునరావాసం కల్పించాకే ఖాళీ చేయించాలని టీడీపీ నాయకులు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి డిమాండ్ చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ప్రముఖ టీడీపీ నాయకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు మిద్దె హుసేని, దస్తగిరి, చింతల సుబ్బరాయుడు, అజ్మీర్, తదితరుల బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి, తదితరులు కలెక్టర్‌ను కలిసి బొగ్గులైన్ వాసులకు అన్ని వసతులతో కూడిన పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంకా కొంత మందికి పట్టాలు మంజూరు, గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.



కలెక్టర్‌తో మాట్లాడి బయటకు వస్తున్న భూమా

ఎక్కడికెళ్ళాలి.. ఎలా బతకాలి?

మున్సిపల్, పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులు బొగ్గులైన్ వాసులను ఖాళీ చేయించేందుకు నోటీసుల మీద నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందులో కొన్ని కాగితం రూపంలో, మరికొన్ని మౌఖిక ఆదేశాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా హుకుం జారీ చేయడం కలకలం రేపుతోంది. అక్టోబరులో ఇళ్ళను కూల్చి వేసినప్పుడు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు బొగ్గులైన్ వాసుల పక్షాన చేసిన పోరాటంతో ప్రత్యామ్నాయం చూపేందుకు చర్యలు తీసుకుంటామని, అంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోమని ఉన్నతాధికారులు హామీలు ఇచ్చారు. అయితే ప్రస్తుతం నాలుగు రోజులుగా బొగ్గులైన్ ప్రాంతంలో అధికారులు చేస్తున్న హడావుడి హెచ్చరికలతో బొగ్గులైన్ వాసులు తాము ఎక్కడికెళ్ళాలి.. ఎలా బతకాలి? అంటూ మరోసారి పోరుబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. కుందూ ఒడ్డున ప్రభుత్వం ఇచ్చిన ఖాళీ స్థలాల్లో ఇళ్లు కట్టుకోవాలంటే రూ.లక్షలు ఎక్కడి నుంచి తేవాలంటూ వాపోతున్నారు. మరో పక్క కొంత మందికి టిడ్కో గృహాల్లో గతంలో కేటాయింపులు జరిగినప్పటికీ, ఎలాంటి మౌలిక సదుపాయాలు లేని టిడ్కో ఇళ్ళల్లో నివాసం ఎలా ఉండాలని బొగ్గులైన్ వాసులు అధికార పార్టీ నేతలు, అధికార యంత్రాంగంపై మండిపడుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా ఉన్న బొగ్గులైన్ నివాస గృహాలు

బొగ్గులైన్ వాసులకు అండగా టీడీపీ

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గులైన్ వాసులకు అండగా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ రంగంలోకి దిగింది. పూర్తి మౌలిక సదుపాయాలతో ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించేంత వరకు ఖాళీ చేయించకూడదని టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. బలవంతంగా ఖాళీ చేయాలని చూస్తే అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. కలెక్టర్‌కు వాస్తవ పరిస్థితులు వివరించడం జరిగిందని, తొందర పాటు నిర్ణయం తీసుకోవద్దని టీడీపీ నేత ఎన్ఎండీ ఫరూక్ అధికారులను డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ళకు లొంగకుండా పేదల పట్ల సానుకూల వైఖరితో అధికార యంత్రాంగం మసులుకోవాలని ఆయన సూచించారు.

ఎంతపని చేశావు జగనన్నా..

పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన



నంద్యాలలో దీక్షాశిబిరం ఎదుట పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన

నంద్యాల నూనెపల్లె, జనవరి 2 : 'ఎన్నికల్లో నీవు ఇచ్చిన హామీలను నమ్మి ఓటేస్తే.. అధికారంలోకి వెళ్లి ఎంత పని చేశావు జగనన్నా..' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీక్షా శిబిరం ఎదుట రోడ్డుపై అంగన్‌వాడీలు పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పిన జగన్ తాను ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు ఈ సందర్భంగా ప్రసంగించారు.

5లోగా విధులకు హాజరు కావాలి

అంగన్‌వాడీలకు కలెక్టర్ విజ్ఞప్తి

నంద్యాల (కల్చరల్), జనవరి 1: గత నెల 12 నుంచి నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఈ నెల 5లోగా విధుల్లోకి రావాలని కలెక్టర్ మనజీర్‌జిలానీ సమూన్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చల చేసిన తర్వాత ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించిందని అన్నారు. తదనుగుణంగా ప్రభుత్వం జీవోలను జారీ చేసిందన్నారు. ఈ సమ్మెవల్ల బాలింతలు, గర్భిణిలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందిపడుతున్నారని అన్నారు. ఈ సమస్యను సహృదయంతో అర్థం చేసుకొని విధుల్లోకి రావాలని మనవి చేశారు. ఒకవేళ సమ్మెను విరమించకపోతే నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు.

ఇది ప్రజాస్వామ్యమేనా?

- వైసీపీకి ఒకలా.. టీడీపీకి మరోలా ఏమిటి?
- ఓట్ల జాబితా అవకతవకలపై గౌరుచరిత ఆగ్రహం

గడివేముల, జనవరి 2: టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడంపై ఉన్న శ్రద్ధ మృతి చెందిన వైసీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడంపై, దొంగ ఓట్లను తీసివేయడంపై ఎందుకు లేదని, ఇది ప్రజాస్వామ్యమేనా? అని పాణ్యం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటరు జాబితాలోని అవకతవకలపై మంగళవారం గడివేముల తహసీల్దార్ శ్రీనివాసులును ఆమె నిలదీశారు. చిందుకూరు గ్రామంలో ఆధార్‌కార్డు, పొలాలు, ఇళ్లు ఉన్న టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఊర్లో లేరని సాకుతో తొలగించారని, బనగానపల్లెలో ఉంటున్న వైసీపీ వాళ్ల ఓట్లు బూజనూరులో ఎక్కించారని, వాటిని ఎందుకు తొలగించలేదని మండిపడ్డారు. టీడీపీకి ఓట్లు వేస్తారన్న నెపంతో అక్రమంగా ఓట్లు తొలగిస్తే ఈసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గడివేములలో ఎమ్మెల్యే భార్య, కొడుకు ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు ఫారం-7 ఇచ్చేంత వరకు తొలగించలేదని అన్నారు. వైసీపీ నాయకులు ఎలా చెబితే అధికారులు అలా పని చేస్తున్నారే తప్ప నిబంధనల ప్రకారం వ్యవహరించడం లేదని అన్నారు. అధికారులు ఇష్టానుసారంగా ఓట్లను చేర్పించడం, చనిపోయిన వారి ఓట్లను తొలగించకపోవడంతో పాణ్యం నియోజకవర్గంలో 3.24 లక్షల ఓట్లు ఉన్నాయని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అధికారులు స్పందించి దొంగ ఓట్లను తొలగించాలని అన్నారు. ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో పంచాయతీ ఎన్నికల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయని అన్నారు. పోలింగ్ కేంద్రాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, గనిహర్ష, దిలీప్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రంగస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గౌరుచరిత

ఉల్లి రైతు కన్నీరు..

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 2: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. గత నెల క్వింటం ఉల్లి గరిష్ఠంగా రూ.4వేలకు అమ్ముడుపోగా.. మంగళవారం రూ.1,969కు అమ్ముడుపోయింది. కనిష్ఠ ధర మరీ ఘోరంగా దిగజారింది. కేవలం క్వింటానికి రూ.615 మాత్రమే అందడంతో ఉల్లి రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ధర కనీసం రవాణా ఖర్చులకు కూడా గిట్టుబాటు కాదని రైతులు వాపోయారు. అదే విధంగా వేరుశనగ రైతుల పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. గరిష్ఠ ధర గత నెలలో రూ.8వేలకు పైగానే ఉంటే మంగళవారం గరిష్ఠ ధర రూ.7,612, మధ్యస్థ ధర రూ.5,859, కనిష్ఠంగా రూ.5,319కు పడిపోయింది. మొక్కజొన్నలు గరిష్ఠంగా క్వింటా రూ.2,040కు అమ్ముడుపోయింది. కందుల ధర రూ.9,500కు చేరింది. మధ్యస్థ ధర రూ.8,236 కాగా, కనిష్ఠ ధర రూ.2వేలు పలికింది. ఎండుమిరపకాయలు క్వింటం గరిష్ఠ ధర రూ.22,569 కాగా, మధ్యస్థ ధర రూ.17,899, కనిష్ఠ ధర రూ.2,024 పలికింది.

ఇంత నిర్లక్ష్యమా..?

- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు
- కళ్ళకు గంతలు కట్టుకొని మున్సిపల్ కార్మికుల నిరసన
- 8వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



నంద్యాలలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 2 : గత వారం రోజులుగా తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మున్సిపల్ కార్మికులు నాయకులు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి భాస్కరాచారిల ఆధ్వర్యంలో 8వ రోజు సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వారం రోజులుగా కోర్కెల సాధన కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తోంటే జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. కళ్లున్నా చూడలేని గుడ్డి ప్రభుత్వం మెడలు వంచే దాకా పోరాడుతామని అన్నారు. సమ్మెను వివిధ రూపాల్లో మరింత ఉధృత స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, సిద్ధయ్యతో పాటు భారీ సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఈ సెల్‌ఫోన్లు వేస్ట్

పూజలతో వినూత్నంగా నిరసన తెలిపిన అంగన్‌వాడీ వర్కర్లు



ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లకు పూజలు నిర్వహిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 2: ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనికి రావని, వీటిలో అనేక యాప్‌లు ఉన్నాయని, ఇవి పని చేయడం లేదని అంగన్‌వాడీ ఉద్యోగులు అన్నారు. మంగళవారం అంగన్‌వాడీల సమ్మె 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీలు ఈ వినూత్న నిరసన చేపట్టారు. సమ్మెకు సీఐటీయూ నగర కార్యదర్శి సాయిబాబా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఏఐటీయుసీ అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, అంగన్‌వాడీల యూని యన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప, భారత యువజన పార్టీ బీసీ సంఘం నాయకులు గౌతమ్‌కృష్ణ యాద వ్, జిల్లా నాయకులు పేరపోగు కళావతి విజయ సమ్మెకు సంఘీభావం తెలిపారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి. నిర్మల తెలిపారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదని, అంగన్‌వాడీలతో పాటు కార్మిక, స్వచ్ఛంద సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు రోడ్లపైకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు.

అప్పుల కుప్పగా రాష్ట్రం

- అధికారంలోకి వస్తే విభజన హామీలు నెరవేరుస్తాం
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి



మాట్లాడుతున్న షేక్ మస్తాన్‌వలి

నంద్యాల టౌన్, జనవరి 2 : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల కుప్పగా మార్చిందని ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాల డీసీసీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మస్తాన్‌వలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, డ్రగ్, మద్యం మాఫియా రాజ్యమేలుతున్నాయన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపేదవాడికి సంక్షేమ పథకం అమలు చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బరిలోకి దిగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేస్తామన్నారు. రైతులకు రూ.3 లక్షల వరకు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పునర్విభజన చట్టం హామీల అమలు వంటి వాటిని ప్రజలకు అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటిస్వామి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, పీసీసీ అధికార ప్రతినిధి వాసు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్‌ఐపై కేసు నమోదు

ఆదోని రూరల్, జనవరి 2: ఆదోని రిటైర్డ్ ఆర్ఐ హరినాథ్‌పై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 31వ తేదీన ఆరేకల్లు గ్రామ శివార్లలో పెద్దపెండేకల్లు రహదారిలో కారుతో ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి ద్విచక్ర వాహనంపై వస్తున్న రిజ్వాన్ ఆలీ, జిలాన్ ఆలీలను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో రిజ్వాన్ ఆలీకి తీవ్ర గాయాలై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు రిటైర్డ్ ఆర్ఐ హరినాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎర్రిస్వామి తెలిపారు.

ఎన్ఎంసీ బయోమెట్రిక్ కష్టాలు

- మొరాయించిన యంత్రాలు
- క్యూలైన్‌లో వైద్యులు
- బయోమెట్రిక్ యంత్రాలను పెంచని అధికారులు



ఎన్ఎంసీ బయోమెట్రిక్ వేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 2: ఎఫ్ఆర్ఎస్ స్థానంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కొత్తగా జనవరి 1 నుంచి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్ఎంసీ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం వైద్యులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. ఎన్ఎంసీ బయోమెట్రి నమోదు చేయడానికి వైద్యులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ పరిపాలన విభాగం, సూపర్ స్పెషాలిటీ బ్లాకులో ఉన్న కొన్ని బయోమెట్రిక్ యంత్రాలు మొరాయించాయి. దీంతో ఉన్న యంత్రాలతో వైద్యులు బయోమెట్రిక్ నమోదు కోసం క్యూలైన్లలో నిలబడ్డ పరిస్థితి తలెత్తింది. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు క్యూలైన్లలో ఉండి వైద్యులు అవస్థలు పడ్డారు. ఓవైపు డీఎంఈ, ఎన్ఎంసీ బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరీ కర్నూలు ప్రభుత్వ కాలేజీ అధికారులు, కర్నూలు జీజీహెచ్ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకుండా ఎన్ఎంసీ నమోదుపై వైద్యులపై ఒత్తిడి తీసుకుని రావడంపై సర్వత్రా విమర్శలు తలెత్తుతున్నాయి.

సరిపడా బయోమెట్రిక్ యంత్రాలేవీ..?

కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో 391 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ అసిస్టెంట్లు, ట్యూటర్లు, సీనియర్ అసిస్టెంట్లు, వైద్యులు పని చేస్తున్నారు. వీరందరికీ కేఎంసీ పరిపాలన విభాగంలో 5 సూపర్ స్పెషాలిటీ బ్లాకులో రెండు, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబరులో ఆర్ఈహెచ్‌లో ఒక బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నాయి. వీటిలో ఫింగర్ ప్రింట్ బయోమెట్రిక్ యంత్రాల గడువు ముగిసింది. రెన్యువల్ కోసం దరఖాస్తు చేశారు. ఇంతలో ఎన్ఎంసీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అంటూ డీఎంఈ ఆదేశాలు జారీ చేశారు. కేఎంసీలో ఐదు బయోమెట్రిక్ యంత్రాలు ఉండగా.. రెండు పని చేయడం లేదు. సూపర్ స్పెషాలిటీ బ్లాకులో కూడా ఒక యంత్రం పని చేయడం లేదు. కర్నూలు జీజీహెచ్ కేఎంసీలో 8 బయోమెట్రిక్ యంత్రాల్లో 3 ఫింగర్ ప్రింట్ యంత్రాలు గడువు తీరడంతో పని చేయడం లేదు. ఇక 391 మంది వైద్యులున్న సంస్థల్లో కేవలం ఆరు బయోమెట్రిక్ యంత్రాలు ఎలా సరిపోతాయని కొందరు వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఎన్ఎంసీ బయెమెట్రిక్ కోసం ప్రతిసారి కర్నూలు మెడికల్ కాలేజీకి రావడం ఇబ్బందిగా ఉందని అన్నారు. ఎక్కడికక్కడ డిపార్టుమెంట్లపరంగా బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేయాలని వైద్యులు కోరుతున్నారు.

వారం రోజుల్లో సమస్య తీరుతుంది

వారం రోజుల్లో బయోమెట్రిక్ సమస్య తీరుతుంది. బయోమెట్రిక్ యంత్రాల సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసి ఎన్ఎంసీ హాజరును పూర్తి స్థాయిలో తీసుకుని వస్తాం. ఇక భవిష్యత్తు అంతా ఫేషియల్ బయోమెట్రిదే. బయోమెట్రి యంత్రాల సమస్యను తీర్చడానికి కొత్త ఐదు యంత్రాలను కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం.

- డాక్టర్ పి.సుధాకర్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల

దశరథరామిరెడ్డి అరెస్టు



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

- 2016 మే 31న సిద్దేశ్వరం అలుగు శంకుస్థాపన ఉద్యమంలో కేసు నమోదు
- వాయిదాలకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారెంట్
- నంద్యాలలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రిమాండ్‌కు ఆదేశించిన ఆత్మకూరు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్

ఆత్మకూరు, జనవరి 2: రాయలసీమ సాగునీటి సాధన సమితి వ్యవస్థాపకుడు బొజ్జా దశరథరామిరెడ్డిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపల్లి మండలంలోని సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై అలుగు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ 2016 మే 31న రాయలసీమ సాగునీటి సమితి ప్రజా శంకుస్థాపన కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. అయితే ఇందుకు అనుమతి లేదని పోలీసులు ఎక్కడికక్కడే జనాన్ని కట్టడి చేశారు. దశరథరామిరెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. అయితే ఆయన పోలీసులకు చిక్కకుండా కపిలేశ్వరం వద్దకు చేరుకొని రాయలసీమ ప్రజాసంఘాల నాయకులతో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ సాధనకై శంకుస్థాపన చేశారు. అనుమతి లేకుండా ఉద్యమానికి పిలుపునిచ్చి, పోలీసు విధులకు ఆటంకాలు కల్పించారంటూ బొజ్జ దశరథరామిరెడ్డితో పాటు వైఎన్.రెడ్డి, భాస్కర్, బుడ్డా శేషారెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డిలపై అప్పట్లో 147, 148, 188, 353, రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ రోజు పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌కు తరలించి రాత్రి విడుదల చేశారు. ఈ కేసు గురించి ఆత్మకూరు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతున్నది. వాయిదాలకు దశరథరామిరెడ్డి హాజరు కావడం లేదని మెజిస్ట్రేట్ ఆయనకు అరెస్టు వారెంట్ జారీ చేశారు. దీంతో సోమవారం కొత్తపల్లి పోలీసులు ఆయన్ను నంద్యాల్లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. మెజిస్ట్రేట్ 14రోజుల పాటు రిమాండ్‌కు విధించారు. అంతకుముందు ఆయనకు ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇదిలా వుంటే బొజ్జ దశరథరామిరెడ్డిని రిమాండ్‌కు తరలించే క్రమంలో సీపీఎం నాయకులు రాజశేఖర్, రణధీర్, నరసింహనాయక్ పోలీసుల వాహనానికి అడ్డంగా వెళ్లి ఆందోళన చేశారు. దీంతో వారిని కొత్తపల్లి, వెలుగోడు ఎస్సైలు హుసేన్‌బాషా, వెంకటప్రసాద్ పక్కకు తోసివేసి, దశరథరామిరెడ్డిని సబ్‌జైలుకు తరలించారు.



అరెస్టును అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు

రాయలసీమ ప్రజల ఆకాంక్షలను గుర్తించాలి

రాయలసీమ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వాలు గుర్తించాలని బొజ్జ దశరథరామిరెడ్డి అన్నారు. తన అరెస్టు నేపథ్యంలో ఆత్మకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2016 మే 31వ తేదిన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ సాధనకు తాము శాంతియుత ఉద్యమిస్తే పోలీసులు రోడ్లను సైతం ధ్వంసం చేసి అడ్డుకొనే ప్రయత్నం చేశారని అన్నారు. అప్పట్లో తనను అదుపులోకి తీసుకున్నప్పటికీ ఎలాంటి కేసులులేవని వెంటనే విడుదల చేశారని చెప్పారు. ఆ తర్వాత కేసు నమోదు చేసిన సంగతి తనకు తెలియదని అన్నారు. రాయలసీమ రైతాంగం కోసం జైలుకైనా వెళ్లేందుకు సిద్ధమైనట్లు వివరించారు. పాలకులకు రాయలసీమ ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఏమాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రాలయం
ఎంఈవోపై విచారణ

- ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం
- డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి

మంత్రాలయం, జనవరి 2: మంత్రాలయం ఎంఈవోగా పని చేస్తూ కోసిగి ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న మైనుద్దీన్‌పై ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదోని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి విచారణ చేపట్టారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో ఎంఈవో మైనుద్దీన్‌ను విచారించిన అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అంపయ్య, భోజరాజు, శ్రీనివాసులు, నాగేంద్ర, సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్, కళ్యాణి, సుజాతలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జగనన్న కిట్లు, ఉపాధ్యాయుల మీటింగ్ సమావేశాలు, నాడు-నేడు, ప్రైవేటు పాఠశాలలపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు పడుతున్న విధానంపై విచారణ చేపట్టారు. అదే విధంగా బూదూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు కూడా ఎంఈవో తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. ఎంఈవో పాల్పడ్డ అక్రమాలపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో పాటు సీఆర్పీలు రాతపూర్వకంగా డిప్యూటీ డీఈవోకు అందజేశారు. కోసిగి మండలంలో జగనన్న విద్యాకానుక రవాణాలో ఎంఈవో కక్కుర్తి పడిన విషయాన్ని అప్పట్లో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. మైనుద్దీన్‌పై హెచ్‌ఎంలు, సీఆర్పీలు వ్యతిరేకంగా నిరూపణకు వచ్చినట్లు తెలిపారు. ఈ నివేదికను ఎంఈవో మైనుద్దీన్‌పై చర్యల నిమిత్తం నివేదికను పంపుతామని డిప్యూటీ డీఈవో తెలిపారు.

ప్రాథమిక వైద్యశాల సిబ్బందిపై చర్యలు

శ్రీశైలం పీహెచ్‌సీ డాక్టర్ షెహనాజ్

శ్రీశైలం, జనవరి 2: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని ప్రాథమిక వైద్యశాల సిబ్బందిపై చర్యలకు సిద్ధమైనట్లు ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు షెహనాజ్ తెలిపారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన సిద్దంశెట్టి సురేష్ ప్రసాద్(35) అస్వస్థకు గురియై మృతిచెందారు. కాగా క్షేత్రపరిధిలోని సాక్షిగణపతి ఆలయం వద్ద అస్వస్థకు గురైన సురేష్‌ప్రసాద్‌కు ప్రాథమిక వైద్యం అందించేందుకు శ్రీశైలం ప్రాథమిక వైద్యశాలకు ఆటోలో తీసుకువచ్చారు. అయితే వైద్యశాల సిబ్బంది సకాలంలో స్పందించి వైద్యం అందించకుండా ఆటోలోనే దాదాపు 45 నిమిషాల పాటు ఉంచారు. ఆదేసమయంలో 108 సిబ్బంది వైద్యశాలకు చేరుకుని సురేష్‌ప్రసాద్‌ను వైద్యశాలలోనికి చేర్చుకోకుండా ఎందుకు ఆటోలోనే ఉంచారని వైద్యశాల సిబ్బందిపై ప్రశ్నించారు. వైద్యశాలలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది, 108 సిబ్బందికి సమన్వయలోపంతో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటు వైద్యశాలలో సేవలను గాలికి వదిలేశారని చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న డాక్టర్ షెహనాజ్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

దుకాణంలో చోరీ

- రూ.1.40 లక్షల

విలువైన సిగరెట్ బండిల్స్ అపహరణ

నంద్యాల క్రైం, జనవరి 2: నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ దుకాణంలో దొంగలు పడ్డారు. సంజీవనగర్ సూరజ్‌గ్రాండ్ హోటల్ సమీపంలో జాకీర్ హుసేన్ అనే వ్యక్తి కిరాణం దుకాణం నడుపుకుంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున దొంగలు పడి దుకాణంలో ఉన్న రూ.1.40 లక్షల విలువైన సిగరెట్ బండిళ్లను ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని జాకీర్‌హుసేన్ దొంగతనం జరిగిన విషయం గ్రహించి లబోదిబోమంటూ నంద్యాల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, జనవరి 2: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్లా వీధికి చెందిన బాబా ఫక్రుద్దీన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాజియా కొద్ది కాలం క్రితం భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. బాబా ఫక్రుద్దీన్ తాగుడుకు బానిసయ్యాడు. భార్య వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ముంతాజ్‌బీ గుర్తించి స్థానికుల సాయంతో ఆసుపత్రిలో చేర్పించింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

శిరివెళ్ల, జనవరి 2 : మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన కందుకూరి హుసేన్‌బీ(40) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. కందుకూరి హుసేన్‌బీ ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలను సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే హుసేన్‌బీ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. మృతురాలి భర్త మహబూబ్ హుసేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ వెల్లడించారు.

నిందితుడి అరెస్టు

చాగలమర్రి, జనవరి 2: చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో అస్లాం అనే యువకుడి హత్యలో వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి కర్నూలు జూనియర్ హోమ్‌కు తరలించినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య తెలిపారు. అస్లాం తన సమీప బంధువు(మైనర్)తో కలసి మద్యం తాగేందుకు వెళ్లారు. అక్కడ ఆ ఇద్దరి మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలో కూరగాయలు తరిగే కత్తితో అస్లాంను పొడిచి హత్య చేశాడు. మృతుడి తల్లి నసిమూన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వయసు 17 సంవత్సరాలు కావడంతో మైనర్‌గా గుర్తించి కర్నూలు జూనియర్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తమ్మడపల్లి దుకాణాల్లో అర్ధరాత్రి చోరీ

మహానంది, జనవరి 2: మండల పరిధి తమ్మడపల్లి గ్రామం సమీపంలోని సూర్యనంది ఆలయ ఆర్చిగేట్ వద్ద ఉన్న నాలుగు దుకాణాల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు యజమానులు దినేష్‌కుమార్, స్వామి కొండయ్య మంగళవారం మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం యథావిధిగా షాపులను తీసేందుకు రాగా షట్టర్లను పగలకొట్టి విలువైన వస్తువులు దొంగలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి షట్టర్లను ఇనుప రాడ్ల సహాయంతో పెకిలించి దొంగతనానికి పాల్పడినట్లు సీసీ పుటేజీల్లో కనిపించిందని పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, విచారిస్తున్నారు.

డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలి

జూపాడుబంగ్లా, జనవరి 2: పెండింగ్ ఉన్న డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్రనాయకులు జాకీర్‌హుసన్ డిమాండు చేశారు. మంగళవారం ఎంఆర్‌సీ వద్ద 2024 క్యాలెండర్‌ను ఎంఈవోలు మద్దిలేటి, శ్రీనివాసులు ఆవిష్కరించారు. పీఆర్‌సీ మధ్యంతరభృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు హనుమంతరెడ్డి, జాకీర్‌హుసేన్, శ్రీనివాసులు, సుజాత పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు శాంతిరాం విద్యార్థి

పాణ్యం, జనవరి 2 : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సి. శ్రీనివాసరెడ్డి జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఆయన మాట్లాడుతూ గత నెల 31న పులివెందులలో జరిగిన జేఎన్‌టీయూ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల ఎంపికలో విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. కేరళలోని కొట్టాయంలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఎండీ శివరాం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఫరూక్, పీడీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రామతీర్థ అక్షింతలు పంపిణీ

నంద్యాల (కల్చరల్), జనవరి 2: నంద్యాల దళిత పేటలో మంగళవారం నగర సంకీర్తనలతో అయోధ్యతీర్థక్షేత్రం నుంచి తెచ్చిన అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. పట్టణంలోని దేవాలయాలన్నింటికీ అక్షింతలతోపాటు ఆహ్వాన పత్రికలను అయోధ్య చిత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎర్రగుంట్ల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరులోని పలు కాలనీల్లో అయోధ్య నుంచి ప్రత్యేకంగా పంపిన అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోటగేరిలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పట్టణ పురోహితులు గరుడాద్రి సత్యనారాయణశర్మ, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆత్మకూరు, డిసెంబరు 13: పట్టణంలోని 20వ వార్డులో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేకించి పట్టణంలోని అన్ని వార్డుల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ తీసుకుంటున్నామని వివరించారు. 20వ వార్డులో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు విజయ్‌చౌదరి, రంగస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థిక బకాయిలను చెల్లించాలి : ఏపీటీఎఫ్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 2: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, సాంబశివుడు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న భవిష్యనిధి నగదును, ఏపీజీఎల్ఐ నగదును ప్రభుత్వం తన అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైందని విమర్శించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, పుల్లయ్య, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బండిఆత్మకూరు, జనవరి 2: మండలంలోని ఆరు గ్రామాల్లో రూ2.20 కోట్ల పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. మంగళవారం మండలంలోని నారాయణా పురం, చిన్న దేవళాపురం, సంతజూటూరు, పెద్దదేవళాపురం, భోజనం, పరమటూరు గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయం, సీసీరోడ్లు డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నారాయణాపురంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని మాజీ జెడ్పీటీసీ చిన్న మద్దిలేటి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ ఎండూరి సరిత, ఆవులపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

మహానంది అభివృద్ధికి పూర్తి సహకారం

మహానంది, జనవరి 2: మహానంది క్షేత్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని పాలకమండలి చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం దేవస్థాన ప్రధాన కార్యాలయంలో పాలక మండలి సమావేశాన్ని ఆలయ ఈవో కాపు చంద్రశేఖరరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులతో పాటు, ఆలయ పరిసరాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు హ్యామస్ లైట్లను ఏర్పాటు చెయ్యాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు రామతులశమ్మ, బుసగాని వెంకటేశ్వర్లు యాదవ్, గంగిశెట్టి మల్లిఖార్జునరావు, బండి హేమలత, కొమ్మా పార్వతమ్మతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను కదిలించిన కళాకారుడు హష్మి



సఫ్దర్‌హష్మికి నివాళి అర్పిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

ఆత్మకూరురూరల్, జనవరి 2: వీధి నాటకాలతో లక్షలాది కార్మికులను ఏకతాటిపైకి తెచ్చి చైతన్య పరిచిన వ్యక్తి సఫ్దర్ హష్మి అని ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు రణదీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ భవనంలో హష్మి వర్ధంతి సందర్భంగా ప్రజా నాట్య మండలి, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక కార్మికుడు బ్రతకడానికి ఎంత కావాలి అనే హల్లబోల్ వీధి నాటికతో దోపిడీ దారుల గుట్టు రట్టు చేసి కార్మికుల్లో చైతన్యం నింపారని కొనియాడారు. చివరకు దోపిడీదారుల చేతుల్లోనే ఢిల్లీ నడి బొడ్డులో హత్య గావించబడటంతో ఎన్నో వేల మంది కార్మికుల కర్తవ్య దీక్షకు ఆయన స్ఫూర్తి పురికొల్పిందన్నారు. ఆయన ఆశయ బాటలో ప్రజా కళాకారులు నడిచినపుడే ఆ మహనీయునికి అందించే నిజమైన నివాళి పేర్కొన్నారు. నాయకులు స్వామన్న, నరసింహనాయక్, సుధాకర్, మాభాష, సురేంద్ర బాబు, ఇస్మాయిల్, రామ్‌నాయక్ తదితరులుపాల్గొన్నారు.

ఈ పాపం ఊరికే పోదు..

● నంద్యాలలో ఉరి వేసుకొని ఉద్యోగుల నిరసన

నంద్యాల (నూనెపల్లె), జనవరి 2: మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందరినీ క్రమ బద్ధీకరిస్తామని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి మోసం చేశారని, ఈ పాపం ఊరికే పోదంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నినదించారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష విభాగాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది చేపట్టుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రంలో దీక్షా శిబిరం వద్ద తాళ్ళతో ఉరి వేసుకుంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ముద్దులు పెడుతూ, సెల్ఫీలు తీసుకుంటూ ఇచ్చిన మోసపూరిత హామీలను గుడ్డిగా నమ్మి ఓట్లు వేశామని, తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించి గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని సాగనంపుతామని హెచ్చరించారు.



ఉరితాడు బిగించుకొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

అంగన్‌వాడీల గోడు వినిపించడం లేదా?

● ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై గౌరు చరిత ఆగ్రహం
● అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం
● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి నిరసన సెగ
● దున్నపోతుకు వినతి పత్రాలు సమర్పించి నిరసన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 22 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల గోడు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత ప్రశ్నించారు. మంగళవారం గడివేములలో అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. 22 రోజులుగా వివిధ రూపాల్లో సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని గౌరుచరిత ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాణ్యంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి అంగన్‌వాడీల నిరసన సెగ తగిలింది. పింఛన్‌ల పంపిణీలో పాల్గొన్న ఆయనను అంగన్‌వాడీలు చుట్టుముట్టి తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 22 రోజులుగా కడుపు మాడ్చుకొని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని, సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి మంచిబుద్ధిని ప్రసాదించాలని కోరుతూ పాములపాడు, మహానందిలో దున్నపోతుకు వినతి పత్రం అందించి బస్టాండు ఆవరణలో ఉన్న ఆర్టీసీ బస్సుల అద్దాలు తుడిచి నిరసన తెలిపారు. జూపాడుబంగ్లాలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి దున్నపోతుకు వినతిపత్రం అందజేసి చేతకాని ప్రభుత్వ గద్దెదిగాలని నినాదాలు చేశారు. ఆత్మకూరులో 22వ రోజు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వానికి మంచి బుద్ది ప్రసాదించాలని కాంక్షిస్తూ.. అర్ధనారీశ్వరుడి వేషం ధరించిన వ్యక్తికి వినతిపత్రాన్ని అందజేశారు. పాణ్యంలో అంగన్‌వాడీ వర్కర్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



గడివేములలో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న గౌరుచరిత






పాములపాడులో బస్సులు తుడుస్తూ అంగన్‌వాడీల నిరసన, ఆత్మకూరులో అర్ధనారీశ్వర వేషం ధరించిన వ్యక్తికి వినతి ఇస్తున్న దృశ్యం, జూపాడుబంగ్లా, మహానందిలో దున్నపోతుకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

వైసీపీకి బైబై

● మరోసారి మోసపోమంటూ నినదించిన వైసీపీ నేతలు
● 22వ వార్డు, సీఎస్ఐ పాలెం, నెహ్రూనగర్ నుంచి భారీ వలస
● మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిక




అల్లూరు గ్రామంలో శివానందరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు

నందికొట్కూరు రూరల్ జనవరి 2 : నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని 22 వ వార్డు, సీఎస్ఐ పాలెం, నెహ్రూ నగర్ నుంచి భారీ సంఖ్యలో వైసీపీ నాయకులు టీడీపీలోకి వలస కట్టారు. జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు నమ్మి వైసీపీలో చేరి మోసపోయాం.. మరోసారి మోసపోయే ప్రసక్తే లేదంటూ వారు నినాదాలు చేశారు. 22వ వార్డు ఇన్‌చార్జి మహబూబ్‌బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముర్తు జావలి ఆధ్వర్యంలో మధు, శ్రీను, పుల్లన్న, శేఖర్, భాస్కర్, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పెద్దన్న సియికిరన్. రాజ్ కుమార్, రామయ్య, మోహన్ బాబు, సురేష్ కుమార్, శివశంకర్ టీడీపీలో చేరారు.

సీఎస్ఐ పాలెం వార్డు వైసీపీ నాయకుల చేరిక

నందికొట్కూరు పట్టణంలోని సీఎస్ఐ పాలెం వైసీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వార్డు ఇన్‌చార్జి అయ్యరాజు, ఎర్రన్న ఆధ్వర్యంలో తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో నాగస్వామి, మాదన్న, పెద్ద నాగస్వామి, శ్రీవర్ధన్, శ్యామ్, చేన్నయ్య, ఏసన్న, అశోక్, రంగస్వామి, వంశీ, కిశోర్, సుందరమ్మ, హుశేన్, గుర్రప్ప, మౌళాలి, చిన్న నాగన్న, రవి, సాగర్ తదితరులు ఉన్నారు. నందికొట్కూరు పట్టణంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఆగడంలేదని, పట్టణం అంతా క్లీన్ స్వీప్ అయ్యేలా ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నెహ్రూనగర్ గ్రామం ఎల్లమ్మబావి నుంచి

నెహ్రూనగర్ ఎల్లమ్మ బావి ఏరియాకు చెందిన వైసీపీ నాయకులు బండి జయరాజు ఆధ్వర్యంలో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరారు.

ముస్లింల ఆత్మీయ సమ్మేళనం

నందికొట్కూరు రూరల్ జనవరి 2 : మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల పార్లమెంటరీ ఇన్‌చార్జి మాండ్రశివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు ముఖ్య అతిథిగా శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు దుల్హన్ పథకం అమలు అయ్యేదని అన్నారు. ఈ పథకం ద్వారా పెళ్లి చేసుకున్న ముస్లిం యువతులకు రూ 50,000 అందించే వారని గుర్తుచేశారు. నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా అందించేవారన్నారు. ముస్లిం నాయకులు కరీముల్లా, షకీల్ అహ్మద్, ముర్తు జావళి, జాకీర్ హుశేన్, రసూల్, కలీలుల్లాబేగ్, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.



ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నాయకులు

మహిళా సాధికారతే టీడీపీ ధ్యేయం : మాండ్ర

నందికొట్కూరు రూరల్ జనవరి 2 : రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించి అభివృద్ధి చెందాలన్నదే టీడీపీ ధ్యేయమని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాండ్ర ఇంటింటికి తిరి ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో మహిళలకు టీడీపీ ప్రవేశపెట్టబోయే మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీచేశారు. మహిళలు మాండ్ర శివానందరెడ్డికి స్వీట్లు తినిపించి వారి అభిమానం చాటుకున్నారు. ఈ సారి ఖచ్చితంగా చంద్రబాబు నాయుడే అధికారంలోకి రావాలని గటిగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, జయసూరి, మద్దిలేటి, బాల మద్దయ్య, అంజిబాబు, సుంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళనపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, జనవరి 2: మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు, జోసెఫ్‌లు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. 2019 ఎన్నికల ముందు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ అధికారంలోకి రాగానే విస్మరించారని అన్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డుమెంట్ బెనిఫిట్ కల్పించడంతో పాటు వేతనంలో సగం పెన్షన్ సదుపాయం ఇవ్వాలని కోరారు. కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రామ్‌నాయక్, ఇస్మాయిల్, సుధాకర్, రవీంద్ర, ప్రసాద్, తిమ్మయ్య, నాగన్న తదితరులు ఉన్నారు.

ఉద్యమ నేతలపై జగన్ జులూం

జగన్ నియంతలా వ్యవహరిస్తున్నాడు
ప్రశ్నించే గొంతుపై కత్తిపెట్టి బెదిరింపులు : ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 2: ఉద్యమ నేత, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం తనను చాలా ఆశ్చర్యానికి గురి చేసిందని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జీ ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జగన్ నియంతలా వ్యవహరిస్తున్నాడని, సాగునీటి కోసం పోరాటం చేస్తున్న వారిని కూడా వదల కుండా ఎప్పుడో 7 ఏళ్ల క్రితం సంగమేశ్వరం వద్ద సిద్ధాపురం అలుగు, ప్రజా శంకుస్థాపన చేపట్టిన అంశంలో బొజ్జా దశరథరామిరెడ్డిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ తన ప్రభుత్వంలో ఎవరినీ బ్రతకనిచ్చే పరిస్థితులు లేకుండా చేస్తున్నాడని, ఈ అరాచక, రాచరిక పాలన ఎక్కువ కాలం సాగదని హెచ్చరించారు. జగన్ వ్యతిరేక విధానాలకు ప్రశ్నించే గొంతుపై కత్తిపెట్టి బెదిరింపులకు పాల్పడటం, అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. దశరథరామిరెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వామపక్ష పార్టీల ఖండన: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అక్రమ అరెస్టును సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయకులు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సీపీఎం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, తదితరులు ఖండించారు. రైతులు, రాయలసీమ ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం చేసే వ్యక్తిని అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వెంటనే దశరథరామిరెడ్డిని విడదల చేయాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌కో కార్మికుల మధ్య ఘర్షణ

● ఒకరికి తీవ్ర గాయాలు

పాణ్యం, జనవరి 2 : మండలంలోని పిన్నాపురం పరిధిలోని గ్రీన్‌కో సంస్థ కార్మికుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల 31 వతేదీ రాత్రి పిన్నాపురం లేబర్ బ్యారక్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన సుబోద్‌కుమార్ యాదవ్, మహ్మద్ సదాబ్ స్నేహితులతో కలసి వారి గది ముందు సల్ ఫోన్‌లో పాటలు వింటుండగా పక్క గది లో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ సాగర్, రాజ్‌కిషోర్, సంత్రామ్ తమకు నిద్రాభంగం కలిగిందని ఘర్షణకు దిగడంతో వారి మధ్య ఘర్షణ తలెత్తినట్లు తెలిపారు. దీంతో రామ్‌సాగర్ కర్రతో మహ్మద్ సదాబ్‌ను కొట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరు కాళ్లతో చేతులతో దాడి చేసి గాయపర్చినట్లు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన మహ్మద్ సదాబ్‌ను కర్నూలు విశ్వభారతి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

గడివేముల, జనవరి 2: ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండదశ పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, వైద్య సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలేవీ..?

పాణ్యం, జనవరి 2 : పెట్రోల బంకుల్లో నియమనిబంధనలు కొరవడ్డాయి. బంకుల్లో కనీస సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు కొరవడి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంకుల యజమానులు వినియోగదారలకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బంకులను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పౌరసరఫరా అధికారులు బంకుల వైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో 184 పెట్రోల్ బంకులున్నాయి. వీటిలో ఎస్సార్ 26, ఇండియన్ కార్పొరేషన్ 53, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ 76, భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన 29 బంకులు ఉన్నాయి.

కొరవడిన నాణ్యతా ప్రమాణాలు : పెట్రోల్, డీజల్ నాణ్యతపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసే ఉపకరణాలు అందుబాటులో ఉండడంలేదు. నాణ్యత నిర్ధారణలో భాగంగా నిర్వహించాల్సిన డెన్సిటీ పరీక్షలకు అవసరమైన ఫిల్టర్ పేపర్ అందుబాటులో ఉంచడంలేదు. నాణ్యతపై అనుమానాలు ఉంటే స్థానిక రెవెన్యూ, పౌర సరఫరాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఇందుకోసమై అధికారుల వివరాలు. ఫోన్ నెంబర్ల బోర్డులు వినియోగదారులకు కనిపించే విధంగా అందుబాటులో ఉంచాలి. అగ్నిమాపక నివారణ పరికరాలు అలంకారప్రాయంగానే ఉంటున్నాయి. పెట్రోలు పోయించుకునేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదనే నిబంధనలు పాటించకపోవడంతో తరచూ కొన్ని చోట్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయన్న వార్తలు వినబడుతూనే ఉన్నాయి. ఇసుక బకెట్లు ఏర్పాటు చేయడంలేదు. ఆయిల్ కార్పొరేషన్ నిబంధనల మేరకు ప్రతి పెట్రోల్ బంకులో వాహనాలకు ఉచితంగా గాలినింపే యంత్రాలు ఉంచాలి. కోరిన ప్రతి వినియోగదారునికి ఉచితంగా గాలి నింపాలి. కొన్ని బంకుల్లో గాలినింపే యంత్రాలు ఉన్నా డబ్బు వసూలు చేస్తున్నారు. ఉచితంగా శుద్ధమైన తాగునీరు వాహనదారులకు అందుబాటులో ఉంచాలి. అలాగే మరుగుదొడ్లు, సేద దీరడానికి అనువైన గదులు ఏర్పాటు చేయాలి. మహిళలకు సురక్షితమైన ప్రదేశంలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో దూరప్రయాణాలు చేసిన వాహనాలు కోరితే వాటికి పార్కింగ్ ఏర్పాటు చేయాలి. రాత్రివేళల్లో బంకుకు చుట్టూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంకుల నిర్వహణపై వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో బంకు నిర్వాహకులకు ఇష్టారాజ్యంగా మారింది.

కేటాయింపులపై నిర్లక్ష్యం : పోలీసు, అంబులెన్స్, జ్యుడిషియరీ, అగ్నిమాపక వంటి అత్యవసర సేవలందించే ప్రభుత్వ వాహనాలకు నిత్యం పెట్రోల్, డీజల్‌ను అందుబాటులో ఉంచాలి. కొన్ని చోట్ల స్టాకు లేదంటూ బోర్డులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరికి కేటాయించిన ఆయిల్‌ను సైతం అమ్ముకుంటున్నారు.



పాణ్యం ఎస్సార్ పెట్రోల్ బంకు

డిజిటల్ లావాదేవీల నిర్వహణ : నగదు కొరతను అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన డిజిటల్ లావాదేవీలు ప్రోత్స హించడానికి పెట్రోల్ బంకుల్లో స్వైప్ యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని చోట్ల ఈ యంత్రాలు మూలన పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. స్థానిక రెవెన్యూ అధికారులు నెలకోసారి బంకులను తనిఖీ చేయాల్సి ఉండగా బంకుల వైపు వెళ్లడమే మానేశారు.

చర్యలు చేపడతాం : ఎన్, వెంకటరాముడు, డీఎస్ఓ, నంద్యాల : సౌకర్యాలు లేని పెట్రోల్ బంకులపై చర్యలు చేపడతాం. బంకు సౌకర్యాలపై ఇప్పటి వరకు ఫిర్యాదులు అందలేదు. బంకు యాజమాన్యాలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశాం. వినియోగదారులకు ఇబ్బందులుకలిగించే బంకులపై సత్వర సత్వర చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి: బీసీ


రేవనూరు గ్రామంలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కొవెలకుంట్ల, జనవరి 2: నవ రత్నాల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేవనూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బీసీ గ్రామానికి చేరుకోగానే గ్రామ టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవీ సుబ్బారెడ్డి, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ నాగుశేని పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జనవరి 2: అవినీతి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని భానుముక్కలలోని బంగారమ్మ తోట ఏరియాలో బీసీ ఇందిరమ్మ బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకంలో భాంగా ఇంటింటి ప్రచారం చేవారు. టీడీపీ ప్రవేశపెట్టే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన పార్టీలు కలిపి పోటీ చేస్తున్నాయని, జగన్ అవినీతి పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి రూ 1.22 లక్షలు అందుతాయని తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాల్సిందే


ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

ఆళ్లగడ్డ, జనవరి 2: కనీస వేతనం అమలు చేయాల్సిందేనని మున్సిపల్ కార్మికులు మంగళవారం డిమాండ్ చేశారు. మున్సిపాల్టీ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో వారు మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు కోరారు.

బీసీ పాఠశాల, కళాశాల తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల, జనవరి 2: బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల, ఐటీఐ కాలేజీ భవనాలను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి పరిశీలించారు. రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ఎంఎస్ఎంఈ సెంటరు నిర్మాణ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.35 కోట్లతో నిర్మిస్తున్న ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీ భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మరో 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అన్నారు.. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గోవా మద్యం స్వాధీనం.. ఐదుగురి అరెస్టు

బేతంచెర్ల, జనవరి 2: గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఐదుగుర్ని అరెస్టు చేసి, 119 మద్యం ఫుల్‌బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు. బేతంచెర్ల-డోన్ రహదారిలోని ఆర్.కొత్తపల్లి బస్టాపు చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. డోన్ వైపు నుంచి బేతంచెర్ల మీదుగా వచ్చే ఆటోలో గోవా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నంద్యాల మండలం అయ్యలూరు మిట్టకు చెందిన మన్నపూల మధు, వెంకటేశ్వర్లు, నెమలూరి మల్లయ్య, ఎద్దుల భాస్కర్, తాటి మురళీకృష్ణ, నంద్యాల పట్టణం పద్మావతి నగర్‌కు చెందిన దూదేకుల బాలహుశేన్‌పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అలుపెరగని పోరాటం

22 రోజులుగా కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


బేతంచెర్లలో ఉరి వేసుకొని నిరసన


శిరివెళ్లలో వంటా వార్పు


చాగలమర్రిలో వృషభానికి వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు



రుద్రవరం: దీక్షలో కూర్చున్న కార్యకర్తలు


ఆళ్లగడ్డలో నినాదాలు చేస్తూ ..



డోన్‌లో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


సంజామలలో దున్నపోతుకు వినతి పత్రం


కోవెలకుంట్లలో..


బనగానపల్లెలో..


దొర్నిపాడులో..

బర్రెకు వినతి పత్రం

బనగానపల్లె, జనవరి 2: బనగానపల్లె పట్టణంలో బర్రెలకు వినతిపత్రాలు సమర్పించి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరసన తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బైఠాయించి నిరసన చేసి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె 22 రోజులకు చేరుకున్నా సీఎం జగన్‌కు కనికరం లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ నాయకురాలు రోజారమణి, సీఐటీయూ నాయకులు సుబ్బయ్య తదితరులు ఈనిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతూ నిరసన

డోన్(రూరల్), జనవరి 2: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరుకున్నాయి. కబడ్డీ ఆడడంతో పాటు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు.

కొనసాగుతున్న సమ్మె

ఆళ్లగడ్డ, జనవరి 2: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను వెంటనే అమలు చేయాలంటూ నినాదాలు చేశారు.

22వ రోజు అంగన్వాడీల సమ్మె

రుద్రవరం, జనవరి 2 : రుద్రవరం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో మంగళవారం 22వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరం ఉత్సాహంతో ఉద్యమం తీవ్రతరం చేసి హక్కులు సాధించుకుంటామని అన్నారు. అప్పటి వరకు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. 3న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, జనవరి 2: చాగలమర్రిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు, హెల్పర్లు కలిసి వృషభానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఉద్యమాన్ని వీడబోమని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

● **కొవెలకుంట్ల, జనవరి 2:** పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేట్టిన సమ్మె 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీల నాయకురాలు వెంకటలక్ష్మి కార్యకర్తలతో కలిసి బర్రెలకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు సుధాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతి పత్రం

సంజామల, జనవరి 2: న్యాయ పరమైన తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ మండల యూనియన్ అధ్యక్షురాలు సుజాత అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ సమ్మె 22వ రోజుకు చేరుకుంది. దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

శిరివెళ్ల, జనవరి 2 : సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అన్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టి సామూహిక భోజనాలు చేసి మంగళవారం నిరసన తెలిపారు.

ఉరి వేసుకొని నిరసన

బేతంచెర్ల, జనవరి 2: పట్టణంలోని పాతబస్టాండులో చేపట్టిన సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఉరి వేసుకొని నిరసన తెలియజేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా జగన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీలు గుల్జార్బీ, నాగలక్ష్మి, శోభారాణి, రాదాదేవి, అంజలిదేవి, లక్ష్మీదేవి, మేరీ, రామతులసి, రమాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

● **దొర్నిపాడు, జనవరి 2:** అంగన్‌వాడీలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దూడకు వినతి పత్రం ఇచ్చారు.

కంది పప్పు పంపిణీ చేస్తాం: జేసీ


పట్టణంలోని రామలక్ష్మి కొట్టాలలో బియ్యం పంపిణీని తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఆళ్లగడ్డ, జనవరి 1: రేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు కంది పప్పు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్ కుమారెడ్డి అన్నారు. పట్టణంలోని రామలక్ష్మి కొట్టాలలో బియ్యం పంపిణీని మంగళవారం పరిశీలించారు. బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా లేదా అనే అంశాలపై కార్డుదారులతో మాట్లాడారు. కంది పప్పు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. పడకండ్లలో నూతన పెట్రోల్ బంకును తనిఖీ చేశారు.

● రైతులు పండించే జొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.3.180 కల్పిస్తామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో మంగళవారం రైతులకు జొన్న పంట కొనుగొలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువులతోపాటు జొన్నలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు జొన్న పంట దిగుబడులను అమ్మితే వారం రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ రామ్మోహనరెడ్డి, వ్యవసాయాధికారులు. సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

● అహోబిలంలో నిర్మిస్తున్న ఏకలవ్య కళ్యాణ మండపాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కళ్యాణ మండపం నిర్మాణంపై అభ్యంతరాలు రావడంతో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈయన వెంట తహసీల్దార్ హరినాథరావు ఉన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి


తహసీల్దార్ విద్యాసాగర్‌ను కలిసిన చిన్నమల్కాపురం గ్రామ నాయకులు, బాధితులు

డోన్(రూరల్), జనవరి 2: మండలంలోని చిన్నమల్కాపురం రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డులో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా ఇళ్లను కోల్పోయే బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, చిన్నమల్కాపురం గ్రామ నాయకులు బద్దల నాగరాజు, రాజేశ్వరరెడ్డి, లక్ష్మన్న, మద్దయ్య, మోకు మద్దయ్య, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిన్నమల్కాపురం గ్రామ బాధితులతో కలిసి ఆ గ్రామానికి చెందిన నాయకులు పార్టీలకతీతంగా డోన్ తహసీల్దార్ విద్యాసాగర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రధాన రోడ్డులో 156 రోడ్డుకిరువైపులా ఉన్న ఇళ్లు రోడ్డు వెడల్పులో కోల్పోనున్నాయని, అయితే సంబంధిత అధికారులు తయారు చేసిన బాధితుల లిస్టులో 133 మందిని మాత్రమే గుర్తించారని, వీటిలో కూడా అవకతవకలు ఉన్నాయని, అధికారులు ఫీల్డ్‌కు వెళ్లి నిజమైన బాధితులను గుర్తించి వారికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. స్థలాలు, ఇళ్లు కోల్పోయే బాధితులకు ప్రత్యామ్నాం చూపాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : సుబ్బారెడ్డి


బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, జనవరి 2: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి దంపతులను సుబ్బారెడ్డితోపాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నిత్యం అబద్ధాలు చెబుతూ అన్ని వర్గాల ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి పతనం తప్పదని, టీడీపీ, జనసేన కూటమి తిరుగులేని విజయం సాధించడం ఖాయమన్నారు.

● **బేతంచెర్ల, జనవరి 2:** మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు సుంకులా పరమేశ్వరి అమ్మవారి జాతరకు ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. సుంకులా కార్యక్రమంలో టీడీపీ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణగౌడు, బేతంచెర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్లనాగయ్య పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వేపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, జనవరి 2: చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి మంగళవారం మిషన్ జీఈఆర్ సర్వేపై అవగాహన ర్యాలీ చేశారు. పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో న్యామతుల్లా మాట్లాడుతున్న బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని సూచించారు. పిల్లలను బడికి పంపించడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. బడిమాని వేసిన పిల్లలను బడికి పంపించేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటయ్య, సీఆర్పీ అమీర్‌ఖాన్, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

చాగలమర్రి, జనవరి 2: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, ఆళ్లగడ్డలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్నామని అన్నారు. 9న ఆళ్లగడ్డకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తుండటంతో టీడీపీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొలిమి ఉసేన్‌వలి, మౌళాలి, అనిఫ్, ఖాజారసూల్, అబ్దుల్‌ఖాదర్, కొలిమిసోను, అబ్దుల్లా, రజాక్, శేఖర్, మాబు షరీఫ్, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

డోన్, జనవరి 2: మండలంలోని కామగానిగుంట్ల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు సూర్య చంద్రగౌడు (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతికి మంగళవారం టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ సంతాపం తెలిపారు. సూర్యచంద్రగౌడు భౌతిక కాయంపై పూలమాలలు వేసి సుబ్బారెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

డోన్(రూరల్), జనవరి 2: పట్టణంలోని ప్రధాన రోడ్లలో యాచకులు, వృద్ధులకు టీచర్స్ కాలనీకి చెందిన యువకులు నూతన సంవత్సరం సందర్భంగా దుప్పట్లు, భోజన కిట్లను అందజేశారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైల్వేస్టేషన్, పాతబస్టాండు తదితర ప్రాంతాల్లో అభాగ్యులకు సాయం అందజేశారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ యువకులు షబ్బీర్, రియాజ్, షారూక్, మున్నా, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

రుద్రవరం, జనవరి 2: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండలో 2024 ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన చేయడంలో ఉపాధ్యాయులు దిక్సూచి లాంటివారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి, సర్పంచ్ వెంకటేశ్, హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగ లక్ష్మి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

బనగానపల్లె, జనవరి 2: పట్టణంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యశాల ఏడీ మారుతీ సకారం, బనగానపల్లె సర్పంచ్ ఎల్లమ్మ మంగళవారం ప్రారంభించారు. ఏడీ మారుతీ సకారం మాట్లాడుతూ బనగానపల్లె పశువైద్యశాఖ పరిధిలోని బనగానపల్లె, అవుకు మండలాలకు 45,900 డోసులు గాలికుంటు వ్యాక్సిన్ సరఫరా అయిందన్నారు. మంగళవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు ప్రతి గ్రామంలో గేదెలకు ఆవులకు టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మానందారెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖురేష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

కొవెలకుంట్ల, జనవరి 2: పశువులకు గాలికుంటు వాధి టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ అన్నారు. మంగళవారం భీమునిపాటు, కలుగొట్ల గ్రామాల్లో గాలి కుంటువ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ నెల రెండు నుంచి 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామన్నారు. ఇందులో భాగంగా భీమునిపాడు, కలుగొట్ల గ్రామాల్లో 84 పశువులకు, 12 ఎద్దులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, అటెండర్ మాధవి, అజిత్‌ఉశేన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు, జనవరి 2: పశువులకు సోకే గాలికుంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ధనుంజయుడు అన్నారు. మంగళవారం దొర్నిపాడులో గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ డీఈడీ రమణయ్య, జేఈవో వెంకటరమణయ్య, వీఎల్‌వో రమేష్, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, జనవరి 2: చాగలమర్రిలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు ఇవ్వాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషాద్రి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

దశరథరామిరెడ్డి అరెస్టు అన్యాయం

బనగానపల్లె, జనవరి 2: రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్ట్ చేయటం అన్యాయమని యాగంటి బసవేశ్వర సంఘం గౌరవ అధ్యక్షుడు మూరెడ్డి, కార్యదర్శి శివక్రిష్ణయాదవ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ బొజ్జాను అరెస్టు చేయడమంటే రైతులను అవమానించినట్టేనని అన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం పోరాడుతున్న బొజ్జాపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతోందన్నారు. నియంతృత్వ పాలన ఇలాగే కొనసాగిస్తే రైతులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాల్, రమేష్, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం

ఆళ్లగడ్డ, జనవరి 2: క్రీడల అభివృద్ధికి సహకరిస్తామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజు అన్నారు. పట్టణంలోని స్పోర్ట్ అకాడమీని మంగళవారం సందర్శించారు. ఆళ్లగడ్డ నుంచి బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల పోటీల్లో గెలుపొంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన ఘనత ఉందన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈయన వెంట వైద్యుడు రామసుబ్రమణ్యం, శిక్షకుడు సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

ఆలయానికి మైక్ సెట్ విరాళం

బనగానపల్లె, జనవరి 2: యాగంటి క్షేత్రానికి కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీసర్ అనంత పద్మనాభరావు, మేనేజర్ ప్రమోద్‌కుమార్ నాయక్ మంగళవారం మైక్‌సెట్‌ను విరాళంగా ఇచ్చారు. మాజీ ఆలయ చైర్మన్ తోటా బుచ్చిరెడ్డి యాంప్లి ప్లేయర్, మైక్‌సెట్, కంప్యూటర్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది, ఆయ అర్చకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్యాపిలి, జనవరి 2: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ తహసీల్దారు మారుతి సూచించారు. మంగళవారం పట్టణంలోని క్రిందిగేరి యూపీ పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ పిల్లల భోజనంలో ఎటువంటి నాణ్యత లోపించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు తాగు నీటి వసతి కల్పించాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు రామానాయుడు, నవీన్ పాల్గొన్నారుజ

అందరి కోసం ఆరోగ్య సురక్ష

రుద్రవరం, జనవరి 2 : ఆరోగ్యం అందరికీ అందించేందుకే సురక్ష వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి అన్నారు. మంగళవారం కోటకొండ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. తరలి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వార్డు మెంబరు రాజీనామా

సంజామల, జనవరి 2: సంజామల పంచాయతీ వార్డు సభ్యుడి పదవికి ఎం.ఖాజాహుసేన్ మంగళవారం రాజీనామా చేశారు. 11వ వార్డు మెంబరుగా ఎన్నికైన ఖాజాహుసేన్ ఆ పదవి ఇష్టం లేక పంచాయతీ కార్యదర్శి గోపినాథ్, సచివాలయ కార్యదర్శి భారతికి రాజీనామా పత్రాన్ని అందజేశారు.